విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
శుక్రవారం 24 ఏప్రిల్ 2026

# మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి ప్రత్యేక చొరవతో ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం

ధర్మవరం, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

ధర్మవరం నియోజకవర్గంలోని వికలాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకొని, సంస్కృతి సేవా సంస్థ సౌజన్యంతో, భగవాన్ మహావీర్ వికలాంగ సహాయత సమితి (దీవీయూ) -- హైదరాబాద్ శాఖ ద్వారా ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు గురువారం ధర్మవరం ఎన్జీవో హోంలో ఏఎన్ఎంలు మరియు ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు పాల్గొని ప్రసంగించారు..... ఈ కార్యక్రమం ఈ నెల 27 మరియు 28 తేదీలలో ధర్మవరం పోతుకుంట ఏరియా ఆసుపత్రిలో నిర్వహించబడుతుందని ఆయన వెల్లడించారు. 27వ తేదీన వికలాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాల కొలతలు తీసుకోబడతాయని, 28వ తేదీన స్వయంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి చేతుల మీదుగా కృత్రిమ కాళ్లు, చేతులు, ఇతర సహాయక పరికరాలు ఉచితంగా పంపిణీ చేయబడతాయని ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన దీవీయూ సంస్థ ఇప్పటివరకు లక్షలాది వికలాంగులకు జైపూర్ ఫుట్ సహా అనేక సహాయక పరికరాలను ఉచితంగా అందించి వారికి కొత్త జీవితం ఇచ్చిందని, ఇప్పుడు ఆ సేవలను ధర్మవరం ప్రజలకు అందించడం ఎంతో గొప్ప విషయమని హరీష్ బాబు పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న అర్హులైన వికలాంగులను గుర్తించి, వారికి ఈ అవకాశాన్ని చేరవేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు సూచించారు, ప్రస్తుతం రాష్ట్రంలో తీవ్ర ఉష్ణోగ్రతలు ఉన్న నేపథ్యంలో వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల ఆరోగ్య సంక్షేమం మనందరి బాధ్యత అని హరీష్ బాబు అన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ఏరియా ఆసుపత్రి ఆధునీకరణ, మెడికల్ పరికరాల సమీకరణ, సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కోట్ల రూపాయల సహాయం, ఉచిత కంటి శస్త్రచికిత్సలు, మోకాళ్ల ఆపరేషన్లు



వంటి అనేక సేవలను ప్రజలకు అందిస్తున్నారని ఆయన వివరించారు. వికలాంగులు సమాజంలో వెనుకబడిపోకుండా వారికి అవసరమైన కృత్రిమ అవయవాలను అందించడం ద్వారా వారు స్వయం సమర్థులుగా మారేలా చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని హరీష్ బాబు పేర్కొన్నారు. కాబట్టి ధర్మవరం నియోజకవర్గంలో కాళ్లు, చేతులు, వేళ్లు లేక ఇబ్బందులు పడుతున్న వారు తప్పనిసరిగా 27వ తేదీన పోతుకుంట ఏరియా ఆసుపత్రికి వచ్చి కొలతలు ఇవ్వాలని, 28వ తేదీన ఉచితంగా కృత్రిమ అవయవాలను పొందాలని ఆయన కోరారు. అదేవిధంగా, ఈ సదుపాయం అవసరమైన వారు ముందుగా 7998256789, 8688466361, 9666869393 నంబర్లను సంప్రదించాలి, అలాగే కృత్రిమ అవయవాలు అవసరం ఉన్నవారు తప్పనిసరిగా ఫోన్ నెంబర్ మరియు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావలెను సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మరియు ప్రజల సహకారం ఎంతో కీలకమని, అందరూ భాగస్వాములు కావాలని హరీష్ బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయంత్, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ లక్ష్మీనారాయణ, మారుతి కుమార్, శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెన్స్, నాలుగు మండలాల ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు పాల్గొన్నారు

## మహిళల భద్రతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది..ఎమ్మెల్యే అమిలినేని



కళ్యాణదుర్గం, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

మహిళల భద్రతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ గారు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బేబీ గారు పేర్కొన్నారు. మహిళలకు భద్రత అనేది ఒక సమాజం అభివృద్ధికి అత్యంత ముఖ్యమైన అంశమని అలాంటి మహిళలు, బాల బాలికలకు మరింత రక్షణ, స్త్రీ శక్తి యాప్ గురించి అవగాహన కోసం నేడు కళ్యాణదుర్గం పట్టణంలోని అంబెడ్కర్ విగ్రహం వద్ద నుంచి పద్మావతి గోవిందరాజులు కళ్యాణమంటపం వరకు బైక్ ర్యాలీ చేపట్టగా ముఖ్యఅతిథులుగా జిల్లా ఎస్పీ పీ జగదీష్ గారు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు మాట్లాడుతూ మహిళలు ఎక్కడైతే నిర్భయంగా తిరిగే స్వేచ్ఛను కల్పించి వారికి భరోసా ఇవ్వాలని ఎక్కడా కూడా మహిళలను కించపరిచ కూడదని సమాజంలో మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సాహన్ని అందించాలని తెలిపారు.. మహిళలు భయపడకుండా, స్వేచ్ఛగా జీవించే హక్కు కలిగి ఉండాలని, సమాజంలో మహిళలపై గౌరవాన్ని పెంపొందించాలని

మహిళలు తమ హక్కులు తెలుసుకొని ముందుకు సాగాలన్నారు..మన జిల్లా పోలీసులు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నారని, మహిళలు తమకు ఏవిధమైన ఇబ్బందులు ఉన్న స్త్రీ శక్తి యాప్ ఉపయోగించుకుని రక్షణ పొందాలన్నారు.. ప్రతి మహిళ, బాల బాలికలు స్వీయ రక్షణ నైపుణ్యాలు నేర్చుకోవడం కూడా మంచిదన్నారు..అలాగే ప్రభుత్వం అందిస్తున్న హెల్ప్‌లైన్‌లు మరియు భద్రతా యాప్‌లను ఉపయోగించడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని,

మనందరం కలిసి మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తేనే సమానత్వం సాధ్యమవుతుందన్నారు..బాల్య వివాహాలను కూడా నివారించి ఉన్నత చదువులకు ప్రోత్సాహం అందించి ఉన్నత స్థాయికి ఎదిగేలా చూడాలని అందుకు ప్రతి తల్లిదండ్రులు ముందుకు నడవాలన్నారు..

## హ్యాండ్ సంస్థ సహకారంతో పండ్ల మొక్కల రైతులకు అవగాహన కార్యక్రమం

- ముఖ్య అతిథులుగా హాజరైన ఫారెస్ట్ రైజ్ ఆఫీసర్ శివరాం, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మాధవి
- సుస్థిర వ్యవసాయం, అగ్రో ఫారెస్ట్రీ ప్రయోజనాలపై అవగాహన
- హాండ్స్, సే ట్రీస్ సంస్థ ద్వారా రైతులకు పండ్లు పెంపకానికి ప్రోత్సాహం

కూడేరు, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)


కూడేరు మండలంలోని భగవతి ఫంక్షన్ హాల్ నందు ప్రోగ్రాం డైరెక్టర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో గురువారం రోజున అగ్రోఫారెస్ట్రీ -- క్లైమేట్ ప్రూఫింగ్ ఫార్మ్ లైవ్‌లీహుడ్స్ ప్రోగ్రామ్ కింద (ఎల్ ఎస్ సి) సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హ్యూమన్ అండ్ నేచురల్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ సొసైటీ హాండ్స్ సంస్థ, సే ట్రీస్ సంస్థ సహకారంతో పండ్ల మొక్కలు పెంచిన 4 మండలాలకు చెందిన 44 గ్రామాల నుండి సుమారు 235 మంది రైతులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి హ్యాండ్ సంస్థ ఆహ్వానం మేరకు ఫారెస్ట్ బీట్ అధికారిని మాధవి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివరాం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అనంతరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివరాం మాట్లాడుతూ ఫారెస్ట్రీ మొక్కలపై రైతుల్లో ఉన్న అపోహలను నివృత్తి చేసి, వారి సందేహాలకు సమగ్రంగా సమాధానాలు ఇచ్చారు. అనంతరం అధికారులు సుస్థిర వ్యవసాయం, అగ్రోఫారెస్ట్రీ ప్రయోజనాలు మరియు వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో 4 మండలాలకు చెందిన రైతులు తమ అనుభవాలు, సమస్యలు మరియు సూచనలు తెలియజేసి చురుకుగా పాల్గొని మంచి ఫీడ్‌బ్యాక్ అందించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివరాం మాట్లాడుతూ ఫారెస్ట్రీ మొక్కలపై రైతుల్లో ఉన్న అపోహలను నివృత్తి చేసి, వారి సందేహాలకు సమగ్రంగా సమాధానాలు ఇచ్చారు. అనంతరం అధికారులు సుస్థిర వ్యవసాయం, అగ్రోఫారెస్ట్రీ ప్రయోజనాలు మరియు వాతావరణ మార్పులకు



అనుగుణంగా వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గత 2 సంవత్సరాలలో సుమారు 3 లక్షల 20 వేల మొక్కలను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాబోయే సంవత్సరంలో మరొక లక్ష మొక్కలకు డిమాండ్ ఉన్నట్లు వెల్లడించారు.

అలాగే ప్రస్తుత వేసవి కాలంలో నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులను దృష్టిలో ఉంచుకుని, వారికి రక్షక తడులు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.సమావేశంలో రైతులు వ్యవసాయానికి అవసరమైన ఇన్‌పుట్స్ అందించాలని కోరగా, వారికి అవసరమైన ఇన్‌పుట్స్‌ను కూడా అందజేస్తామని సిబ్బంది హామీ ఇచ్చారు.ఈ సమావేశం ద్వారా రైతులకు అవగాహన పెంపొందించడంతో పాటు, సుస్థిర వ్యవసాయ పద్ధతుల అమలుకు దోహదం చేస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ నారాయణస్వామి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివరాం, ఫారెస్ట్ బీట్ అధికారిని మాధవి, ఆర్ ఎం మనోహర్, ప్రోగ్రాం మేనేజర్ పీరావళి, కేశవ్, టెక్నికల్ అసిస్టెంట్ తేహరా, సాయి చరణ్, సాయిల్ అసిస్టెంట్ సుప్రజ, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ నాగలక్ష్మి, శివ శంకర్, అకౌంటెంట్ భాగ్య రైతులు తదితరులు పాల్గొన్నారు

## "బీసీ గళం" బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరణ



అనంతపురం, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

కూటమి ప్రభుత్వంలో బీసీ వర్గాలపై జరుగుతున్న అన్యాయాలు, నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన అనంతపురం నగరంలోని లలితకళా పరిషత్ లో నిర్వహించనున్న "బీసీ గళం" బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా బీసీ గళం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వైయస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ , ఇతర బీసీ నాయకులు పాల్గొన్నారు.

నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. బీసీల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పథకాలు నిలిచిపోయాయని, ఉపాధి అవకాశాలు తగ్గాయని, విద్య మరియు సంక్షేమ రంగాల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.

బీసీ వర్గాల హక్కుల కోసం గళమెత్తే వేదికగా ఈ "బీసీ గళం" సభ నిలవనుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ బహిరంగ సభలో బీసీ వర్గాల సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వబడుతుందని తెలిపారు

## హనీట్రాప్ కలకలం: ఇద్దరు సీఐలపై వేటు

అనంతపురం, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా పోలీస్ శాఖలో హనీట్రాప్ వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. నిందితులతో సంబంధాలున్నట్లు ఆరోపణలతో రాప్తాడు జ× హర్ష, బాధితుల ఫిర్యా దులపై వెంటనే స్పందించలేదనే కారణంతో త్రీటౌన్ జ× రాజేంద్రనాథ్ యాదవ్ ను కర్నూలు రేంజ్ వీఆరు పంపుతూ అధికారులు ఉత్తర్వులిచ్చారు. వీరిద్దరినీ బుధవారం రిలీవ్ చేశారు. ఈ కేసులో మరికొందరు అధికారుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతుండటంతో పోలీసు వర్గాల్లో ఆందోళన మొదలైంది.



## ఉరవకొండ యువనేత ప్రణయ్ రెడ్డికి మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపు

కూడేరు ఏప్రిల్ 23 !అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర రెడ్డి తనయుడు రాష్ట్ర వైసీపీ యువనేత ప్రణయ రెడ్డికి రాష్ట్ర వైసీపీ అధినేత రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు గురువారం రోజున యువనేత వై.ప్రణయ్ రెడ్డి బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. పట్టణంలోని జక్కుర్ ఏరోడ్రోమ్ కు చేరుకుని వైస్సార్సీపీ అధినేత రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కి యువనేత ప్రణయ్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఉరవకొండ నియోజకవర్గం లోని వైసిపి పార్టీ భవిష్యత్ కార్యచరణపై మరియు ఉరవకొండ వైసిపి పార్టీ బరువు బాధ్యతలు ఎప్పటికప్పుడు చూసుకుంటూ నియోజకవర్గంలోని ప్రజల యొక్క పలు సమస్యలపై సమర్థవంతంగా పోరాటం చేస్తూ ధర్నాలు, రాస్తరోకో లు ద్వారా ప్రభుత్వాన్ని కళ్ళు తెరిపించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతూ నియోజకవర్గం లోని ప్రజల సమస్యలకు భరోసా



కల్పిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర వైసీపీ యువనేత ప్రణయ్ రెడ్డిని అభినందించినట్లు తెలుస్తోంది. అలాగే ఉరవకొండ నియోజకవర్గం లో వైసిపి పార్టీ ని మరింత బలోపేతం చేయాలని ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలు మరియు ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండ గడుతూ ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని చర్చించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఉరవకొండలో వైసిపి జెండా ఎగిరేలా వైసీపీ పార్టీ తరపున సిద్ధంగా ఉండాలని చర్చించినట్టు తెలుస్తుంది

## డేరంగుల కుటుంబ వివాహ వేడుకలో పాల్గొన్న బాలా రమేష్ బాబు



యాడికి, ఏప్రిల్ 23(అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని లాలెప్ప కాలనీకి చెందిన డేరంగుల శివశంకర్ ఆహ్వానం మేరకు వారి కుమారుడు రాజేష్ నవఅమృతల వివాహ మహోత్సవానికి యాడికి మండల వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు, వైసీపీ మండల కన్వీనర్ ఎం సంజీవరాయుడు హాజరయ్యారు. స్థానిక శ్రీ చౌడేశ్వరి దేవి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించిన ఈ వేడుకలో నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లమడి రామ్మూర్తి, వేళ్ళబోయిన వెంకటేష్, పిన్నేపల్లి లక్ష్మిరెడ్డి, చిన్న నారాయణరెడ్డి, శేఖర్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, పీట్ల శీనా (డ్రైవర్), మోహన్, చౌడయ్య, రామంజి, కరుణాకర్, నాగేంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## రామాలయ నిర్మాణానికి అడ్డంకులు గ్రామస్తుల ఆవేదన



యాడికి, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

యాడికి మండలం కమలపాడు గ్రామంలో గ్రామస్తుల సహకారంతో రామాలయ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గ్రామ ప్రజలు అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టగా, రామాలయం పక్కనున్న స్థల యజమాని తరచూ నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. దీంతో ఆలయ నిర్మాణ పనులు నిలిచిపోయే పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల ఐక్యతతో సాగుతున్న ఆలయ నిర్మాణానికి అడ్డంకులు కలగడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు వెంటనే పరిగణనలోకి తీసుకొని సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. రామాలయ నిర్మాణ పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు

## ప్రపంచ మలేరియా దినోత్సవ బ్యానర్ ఆవిష్కరణ




యాడికి, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

జిల్లా మలేరియా అధికారి డి ఓబులు ఆదేశాల మేరకు తాడిపత్రి శ్రీనివాసపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సయ్యద్ ముష్కిన్ హుల్ హక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొని ఈనెల 25న జరిగే ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వార్డుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని, రక్తపూత నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించాలని ఏఎన్ఎంలకు సూచించారు. ల్యాబ్ రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## డేరంగుల కుటుంబంలో వైభవంగా వివాహ వేడుకలు



యాడికి ,ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని లాలెప్ప కాలనీకి చెందిన డేరంగుల శివశంకర్ కుమారుడు రాజేష్ వివాహ వేడుకలు యాడికిలోని శ్రీ చౌడేశ్వరి కళ్యాణ మండపంలో అత్యంత వైభవంగా జరిగాయి. నవఅమృతతో రాజేష్ వివాహ బంధంతో ఒక్కటవగా, కుటుంబ సభ్యులు ఆనందోత్సాహాల మధ్య వేడుకలను ఘనంగా జరిపించారు. ఈ శుభ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టిడిపి మండల కన్వీనర్ దడియాల ఆది, గండికోట లక్ష్మణ్, రూపునేని రాజశేఖర్, చిట్టిబాబు తదితర టిడిపి నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే బంధుమిత్రులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులకు అభినందనలు తెలిపారు




## భక్తుల సహకారంతో శ్రీ కొత్తరాయుని స్వామి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు





యాడికి, ఏప్రిల్ 23(అనంత ప్రభ)

యాడికి మండలం కమలపాడు పంచాయతీ చింతలాయపల్లె సమీపంలో స్వయంభుగా వెలసిన శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి దేవస్థానంలో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు గంగవరం ఫ్యామిలీ మరియు భక్తుల ఆధ్వర్యంలో శిథిలమైన ధ్వజస్తంభం స్థానంలో నూతన ధ్వజస్తంభం పునరుద్ధరించి ఇత్తడి కవచం తొడగడం జరిగింది. మహాగణపతి, హనుమాన్, గరుడఅల్వార్,శంకు చక్ర నామాలు, శ్రీవారిపాదాలు జయ విజయులు, బలిపీఠము, తులసి బృందావనము మొదలైన విగ్రహాలు ప్రతిష్ఠించడం అనంతరం 41 (మండలం పూజ) రోజుల పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. అలాగే భక్తులు ఉచితంగా కళ్యాణం చేసుకొనుటకు రెండు రేకుల షెడ్లు కళ్యాణ కట్టలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఉదయం బ్రహ్మ ముహూర్తంలోనే సుప్రభాత సేవ, మంగళస్నానం, పంచామృతాభిషేకం నూతన వస్త్రాల సమర్పణ, హోమాధి కార్యక్రమాలు ఆలయ పూజారి హరిస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తాదులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. దాదాపుగా 300 మంది ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు అల్పాహారము, విందు భోజనము, యాడికి నుండి స్వామివారి ఆలయం వరకు భక్తుల కోసం ఉచిత వాహన సౌకర్యము ఏర్పాటు చేశారు. ఈ ఆలయ అభివృద్ధి కార్యక్రమం విజయవంతం కావడానికి గంగవరం వంశస్థులలో చంద్రయ్య శెట్టి, శేఖర్, రాజేష్, శ్రీధర్, సురేష్, సత్యనారాయణ ప్రసాద్, రాజా, రవి,వాసు,రాజేంద్ర తదితరులకు ఆలయ పూజారి హరిస్వామి సన్మాన కార్యక్రమం నిర్వహించారు

## చవ్వా అశ్వర్థమ్మ వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, ఏప్రిల్ 23 (అనంత ప్రభ )

యాడికి మండల కేంద్రంలోని కోన రోడ్డులో గల చవ్వా అశ్వర్థమ్మ వృద్ధాశ్రమంలో గురువారం దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యుడు, 6 న్యూస్ విలేకరి సిద్ధవటం తిరుమలరెడ్డి తన భార్య సిద్ధవటం ప్రభావతి ఆరవ వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఆమె జ్ఞాపకార్థంగా ప్రతి సంవత్సరం ఏదో ఒక సేవా కార్యక్రమం చేయాలని సంకల్పించామని, గత ఏడాది కూడా ఇదే విధంగా అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. భోజనానంతరం ఆశ్రమంలోని వృద్ధులు సిద్ధవటం తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులకు ఆశీస్సులు అందజేసి, సిద్ధవటం ప్రభావతి ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పుట్టినరోజులు, వర్ధంతులు, ఇతర శుభకార్యాల సందర్భంగా ఆశ్రమంలో అన్నదానం చేయడం లేదా అవసరమైన వస్తువులు అందజేసి సేవా కార్యక్రమాలకు సహకరించాలని ఆశ్రమ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం తిరుమలరెడ్డి కుమార్తె కీర్తన కుమారుడు యువ కిషోర్ రెడ్డి యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ అధ్యక్షుడు బండారు బాలకృష్ణ, కార్యదర్శి ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## చీనీ,మామిడి,దానిమ్మ పంటలను పరిశీలించిన ఉద్యాన శాస్త్రవేత్తలు, అధికారులు



కూడేరు, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

కూడేరు మండలంలోని మరుట్ల గ్రామంలో గురువారం రోజున ఉద్యానవనాధికారిణి యామిని మరియు ఉద్యానవన శాస్త్రవేత్తలు చీనీ, మామిడి, దానిమ్మ తోటలను పరిశీలించారు. చీనీ తోటల ప్రధానంగా గమ్మేసిస్ ఎక్కువగా గమనించడం జరిగింది. గమ్మేసిస్ లో సైటుస్తోరా, గమ్మేసిస్ వలన వస్తుంది. గమ్మేసిస్ వచ్చిన మొక్కల్లో కాండం బెరుడు అంతా కూడా బంక మాదిరిగా స్రవించడం నిదానంగా చెట్టు మొత్తం ఎండిపోయిన లక్షణాలు కనిపిస్తాయి. వేరు కుల్లు తెగులు సోకినట్లయితే పోషక పదార్థాలు నీరు చెట్లకు అందకుండా కాలక్రమమైన చెట్టు ఎండి పోవడం జరుగుతుంది. తెగులు సోకిన చెట్టు విపరీతంగా పూత పట్టి కాయలు పక్వానికి వచ్చేసరికే చెట్టు మొత్తం ఎండిపోతుంది. వేరుకుళ్ళు సోకిన వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కలుపు మందును చెట్టుకు కొంచెం దూరంగా కాండం వేర్లకు తగలకుండా పిచ్చికారి చేసుకోవాలి. ప్రధానంగా సేంద్రియ ఎరవులను ట్రైకోడెర్మా సూడోమోనాస్ వంటి వాటిని ఉపయోగించాలి. ప్రస్తుతం వేరు కుళ్ళు తెగులు నివారణకు ప్రొద్దున నీటి తడిని పెట్టుకుని సాయంత్రం ఎం-45 మూడు గ్రాముల లీటర్ నీటికి కలుపుకొని చెట్టు వేరు భాగం తడిచేటట్టుగా పోసుకోవాలి. అలాగే రైతులు దబ్బు లాటరల్ డ్రిప్పును ఉపయోగించాలి. గమ్మేసిస్ నివారణకు రైడోమిల్ గోల్డ్ ను 1.5 గ్రాముల మందులు లీటర్ నీటికి కలిపి చెట్లు వేరు బాగా తడిసేలాగా పోసుకోవాలి. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ దేవానంద్, ఎం. తిరుపతిరెడ్డి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్, ఉద్యాన పరిశోధన స్థానం అనంతపురం, డాక్టర్ కే. దినేష్, సైంటిస్ట్ మరియు రైతు సేవ కేంద్రం అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు

## గుడిసె కృష్ణమ్మ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతోత్సవం ఘనంగా



కర్నూలు, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

శ్రీ శ్రీ శ్రీ భగీరథ మహర్షి రాష్ట్ర స్థాయి జయంతోత్సవం ఈ రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సునాయన ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖతో పాటు వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసింది. కార్యక్రమం సందర్భంగా భగీరథ మహర్షి సేవలను స్మరించుకుంటూ పలువురు నేతలు ఆయన ఆలోచనలను కొనియాడారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆది గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ, భగీరథ మహర్షి సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధికి ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం నెలకొల్పడంలో ఇలాంటి మహనీయుల పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ. శ్యామ్ కుమార్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ భగీరథ మహర్షి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కెడీసీఎంఎస్ చైర్మన్ శ్రీ వై. నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రం సింగ్, రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ ఎల్.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో మహర్షి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు

## ఆదోనిలో డిప్యూటీ డీఈఓపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ డిమాండ్




ఆదోని, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

ఆదోని పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలకు మద్దతుగా వ్యవహరిస్తున్న డిప్యూటీ డీఈఓను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పట్టణ అధ్యక్షుడు సంజయ్ మాట్లాడుతూ, పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై విద్యాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తమ పాఠశాలలో చేర్పించాలని ఒత్తిడి చేయడం, పుస్తకాలు, టై, బెల్ట్ పేర్లతో తల్లిదండ్రుల నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

డిప్యూటీ డీఈఓ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోజూ అనేకమంది కార్యాలయానికి వచ్చి తిరిగి వెళ్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. అదేవిధంగా, తన ఇంటినే కార్యాలయంగా మార్చుకుని అక్కడే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల ఫైళ్లపై సంతకాలు చేయాలంటే సాయంత్రం తర్వాత ఇంటికి రావాలని చెప్పడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు.

జిల్లా విద్యాశాఖ అధికారి వెంటనే స్పందించి విచారణ చేపట్టి సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు.

## రాప్తాడు లోనే పలు వివాహాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



ఆత్మకూరు, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

రాప్తాడు నియోజకవర్గం లోనే పలు వివాహా శుభకార్యములకు గురువారం రోజున మాజీ ఎమ్మెల్యే వైసిపి సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## పేదవారి వివాహాలకి ఆర్థిక సహాయం వైసిపి నాయకులు దాసరి వెంకటరమణ



శింగనమల, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

శింగనమల మండలం గురుగుంట్ల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం నాగభూషణం కుమార్తె వివాహానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం పండగ చేసిన దాసరి వెంకటరమణ ఈ సందర్భంగా వైసిపి నాయకులు నాగులగుడ్డం దాసరి వెంకటరమణ మాట్లాడుతూ.. సామాజిక సేవే తమ లక్ష్యమని, ముఖ్యంగా పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు సహాయం చేయడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అవసరమున్న ప్రతి ఒక్కరికి సాధ్యమైనంత సాయం అందిస్తామని వైసిపి నాయకులు దాసరి వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జి మల్లికార్జున నాగభూషణం మల్లికార్జున నారాయణరెడ్డి పుల్లప్ప నాగలింగ వెంకటేష్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## క్యాన్సర్ చికిత్సలో నైపుణ్యం సాధించిన ప్రభుత్వ వైద్యులకు ఘన సన్మానం



గుంతకల్లు, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

గుంతకల్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్యంపై శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ సల్మాన్ జావేద్‌లను ఘనంగా సన్మానించారు. ఇద్దరు వైద్యులు గతం నుంచే గుంతకల్ ఏరియా హాస్పిటల్‌లో విశిష్ట సేవలు అందిస్తూ వస్తున్నారు. ఇటీవల కర్నూల్‌లోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన కెమోథెరపీ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక నైపుణ్యం సాధించడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణతో గుంతకల్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో క్యాన్సర్ రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం హర్షణీయమని పేర్కొన్నారు. అనంతరం వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్, సాయి మహిళ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ప్రభాకర్, జనవిజ్ఞాన వేదిక నాయకులు సుధాకర్, లక్ష్మీప్రసాద్ యాదవ్, సోషల్ వర్కర్ జయన్న తదితరులు పాల్గొన్నారు

## గుంతకల్లు రైల్వే సమస్యలపై జీఎంకు బీజేపీ వినతి



గుంతకల్లు, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

గుంతకల్లు పట్టణంలోని ప్రజలు మరియు రైల్వే ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మత్తూర్‌కు బీజేపీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైల్వే సేవల విస్తరణతో పాటు పరిపాలనా లోపాలను సరిదిద్దాలని కోరారు.

తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు వరకు పొడిగించాలని, ధోన్ నుంచి హుబ్లీ వరకు కొత్త రైలు సర్వీసును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కర్నూలుకు వైద్య అవసరాల కోసం వెళ్లే రోగులకు ఈ నిర్ణయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. అలాగే రైల్వే విభాగంలో సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ (రాతీ.ఐూూ) నియామకం లేకపోవడంతో ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గుంతకల్లు రైల్వే ఆసుపత్రిలో అదనపు వైద్యుడిని నియమించి, ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనగొంది విజయలక్ష్మి, గుర్రం సూర్యనారాయణ, జీఎం మహేష్, జిలకర విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

AP 4PG 24 - 4- 2026 FRIDAYqxp_Layout 1 23-04-2026 09:38 PM Page 3



## నూతన డిప్యూటీ ఎంపీడీవో గా కే.నరసింహమూర్తి



కూడేరు, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

కూడేరు మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి గురువారం రోజున నూతన డిప్యూటీ ఎంపీడీవో గా (పంచాయతీ) లకు కే. నరసింహమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లా పరిషత్ ఈఈ, పి ఆర్ ఐ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేశారు. ప్రస్తుతం కూడేరు మండల ప్రజా పరిషత్ కు డిప్యూటీ ఎంపీడీవో గా బాధితుల స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో (జి ఎస్ డబ్ల్యూ) జలాన్ భాష, కూడేరు పంచాయతీ సెక్రటరీ రమాదేవి, ఇప్పేరు పంచాయతీ కార్యదర్శి పావని రెడ్డి, చోళసముద్రం పంచాయతీ సెక్రటరీ సుభాషిని సచివాలయ ఉద్యోగులు పూల గుచ్చాన్ని అందించి స్వాగతం పలికారు.




## అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలను కాపాడాలి: జనసేన ఇన్చార్జి వాల్మీకి లక్ష్మన్న

మంత్రాలయం, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

మంత్రాలయం, అంగన్వాడి కేంద్రాలు మరియు ప్రభుత్వ కార్యాలయాలను రక్షించాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం మంత్రాలయంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన ఇన్చార్జి, రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ అధ్యక్షుడు వాల్మీకి బి. లక్ష్మన్న నాయకత్వం వహించారు.

ఎమ్మార్వో కార్యాలయం నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా రాఘవేంద్ర స్వామి సన్నిధి వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం రాఘవేంద్ర సర్కిల్ వద్ద ధర్నా చేపట్టారు. తరువాత ఎమ్మార్వో (తహసీల్దార్) కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ, మంత్రాలయం పరిసర ప్రాంతాల్లోని భూములు శ్రీ రాఘవేంద్ర స్వామి మఠానికి చెందినవని తెలిపారు. అయితే ఆ భూములపై ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలు మరియు పలు ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుతం మఠం యాజమాన్యం అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీ చేయాలని, లేకపోతే తాళాలు వేస్తామని హెచ్చరిస్తున్నట్లు ఆరోపించారు. ప్రజలకు సేవ చేయాల్సిన మఠం యాజమాన్యం ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదని అన్నారు.సంస్కృత పాఠశాల ఎదుట ఉన్న పశువుల ఆసుపత్రిని ఇప్పటికే తొలగించారని, ఎంఈఓ



కార్యాలయాన్ని కూడా ఖాళీ చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని విమర్శించారు. మంత్రాలయం గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. శాంతి భద్రతలు, అభివృద్ధి కార్యక్రమాలను పరిరక్షించాలని ఈ ధర్నా ద్వారా తెలియజేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పెద్ద కడూరు మండల అధ్యక్షుడు జి. బజారప్ప, కోసిగి మండల అధ్యక్షుడు సి. వీరారెడ్డి, మంత్రాలయం మండల అధ్యక్షుడు బి.వి. రవిచంద్రతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు

## నాణ్యమైన విద్య అందించడమే చైతన్య పాఠశాలల లక్ష్యం



ఆలూరు, ఏప్రిల్ 23 (అనంత ప్రభ)

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే చైతన్య పాఠశాలల ప్రధాన లక్ష్యమని జిల్లా కోఆర్డినేటర్లు రమణ, నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చైతన్య పాఠశాలల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. నృత్యాలు, పాటలు, నాటికలు వంటి ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభను అభివృద్ధి పరచడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి విద్యతో పాటు సహపాఠ్య కార్యక్రమాలు కూడా సమానంగా అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు







## తలకాయ కూర వండడం రావడం లేదా? ఇలా అయితే సింపుల్



తలకాయ కూర మటన్ విభాగం కిందకే వస్తుంది. మేక, గొర్రెల తలలతోనే ఈ కూరను వండుతారు. అందుకే మటన్ తినడం వల్ల కలిగే లాభాలన్నీ ఈ కూర తిడనం వల్ల కలుగుతాయి. మటన్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి మహిళలు అధికంగా తింటే మంచిది. వీరికి రక్తహీనత సమస్య అధికంగా ఉంటుంది. ఈ మటన్లో బి విటమిన్లు అధికంగా లభిస్తాయి.గర్భిణులు మటన్ తినడం వల్ల పుట్టబోయే బిడ్డకు చాలా లాభాలు కలుగుతాయి. మటన్లో ఉండే పొటాషియం రక్తపోటు, గుండెజబ్బులు, కిడ్నీ సంబంధ వ్యాధులు రాకుండా కాపాడతాయి. ఇందులో ఉండే కాల్షియం దంతాలు, ఎముకల గట్టిదనానికి సహకరిస్తాయి. తలకాయ కూర సులువుగా ఎలా వండాలో చూడండి.

%కావాల్సిన పదార్థాలు

తలకాయ మాంసం - అరకిలో
ఉల్లిపాయ - ఒకటి
అల్లం వెల్లుల్లి పేస్టు - రెండు స్పూన్లు
కారం - ఒక స్పూను
పసుపు - ఒక స్పూను
గరం మసాలా - ఒక స్పూను
కొత్తమీరు తరుగు - నాలుగు స్పూనులు
ధనియాల పొడి - ఒక స్పూను
ఉప్పు - రుచికి సరిపడా
కొబ్బరి తురుము - ఒక స్పూను
మిరియాల పొడి - అరస్పూను
(కొబ్బరి తురుము మీకు నచ్చితే వేసుకోవచ్చు. వేయకపోయినా రుచి బాగానే ఉంటుంది)

తయారీలో ఇలా

1. తలకాయ కూరను బాగా కడిగి పెట్టుకోవాలి.
2. ఉల్లిపాయలు నిలువుగా సన్నగా తురమాలి. స్టవ్ పై కుక్కర్ పెట్టి అందులో నూనె వేయాలి.
3. నూనె వేడెక్కాక ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించాలి.
4. అల్లం వెల్లుల్లి పేస్టు కూడా వేయించాలి. పసుపు, కారం కూడా కలపాలి.
5. అందులో తలకాయ కూర వేసి మూత పెట్టి రెండు విజిల్స్ వచ్చేదాకా ఉడికించాలి.
6. స్టవ్ మీద మరో కళాయి పెట్టి కుక్కర్లోని కూరను ఇందులోకి మార్చాలి.
7. ఉప్పు కూడా వేసి కాసేపు ఉడికించాలి.
8. ముక్క 90 శాతం ఉడికిపోయాక మిరియాల పొడి, ధనియాల పొడి, గరం మసాలా, కొబ్బరి తురుము వేసి ఉడికించాలి. అప్పటికే కూర బాగా ఉడికి మంచి వాసన వస్తుంది.
9. స్టవ్ కట్టేశాక పైన కొత్తిమీర చల్లి సర్వ్ చేయాలి. నాన్ వెజ్ ప్రియులెందరికీ తలకాయ కూరంటే ప్రాణం. ప్రత్యేకంగా వండుకుని తింటారు. ఇలా వండుకుని తింటే చాలా టేస్టీగా ఉంటుంది.

## బేకింగ్ సోడాతో ఇలా చేస్తే ఫర్నీచర్‌పై మరకలు పోతాయి

ప్రతి ఇంట్లోనూ ఫర్నీచర్ ఉంటాయి. సోఫా, మ్యాట్రెసెస్, చైర్స్ ఇలా చాలా రకాలు ఉంటాయి. వీటిని క్లీన్ చేసేందుకు చాలా టిప్స్ పాటించాలి. దీని వల్ల సోఫాలు చక్కగా క్లీన్ అవుతాయి. మరి అలా ఎఫెక్టివ్‌గా ఎలా దులపాలో ఇప్పుడు చూద్దాం.

ముందుగా మ్యాట్రెసెస్, సోఫా ఇంట్లోని సోఫాని ముందుగా దుమ్ముపోయేలా పొడి గుడ్డతో దులపండి. ఇంట్లో వాక్యూమ్ క్లీనర్ ఉంటే దానిని కూడా వాడొచ్చు.


దుమ్ము దులిపేటప్పుడు కేవలం ఫర్నీచర్ ముందుగానే కాకుండా, మూలలు, వెనకాల మొత్తంగా పూర్తిగా దులపండి.కొన్నింటికి పాకెట్స్ ఉంటాయి. వాటిని కూడా చక్కగా క్లీన్ చేయండి.

ఇప్పుడు గోరువెచ్చని నీటిలో కొద్దిగా వెనిగర్ వేసి అందులో క్లాత్‌ని ముంచి దానిని స్క్వీజ్ చేసి చక్కగా ఫర్నీచర్‌ని క్లీన్ చేయండి. దీని వల్ల ఫర్నీచర్ చక్కగా క్లీన్ అవుతాయి.

ఇత్తడి వస్తువులు కూడా..

ఇంట్లో ఇత్తడి వస్తువులు కూడా ఉంటాయి. ఇవి కూడా త్వరగా మసకబారిపోతాయి. వీటిని కూడా చక్కగా క్లీన్ చేసుకోవచ్చు. ఇందుకోసం అరకప్పు డిష్ వాష్, ఓ టీస్పూన్ ఉప్పు, కొద్దిగా పిండిని కలిపి వీటిపై చల్లి తెలిగ్గా క్లీన్ చేయొచ్చు. దీంతో వస్తువులు చక్కగా తెల్లగా మెరుస్తాయి.

ఉడ్ ఫర్నీచర్..



ఇక ఉడ్ ఫర్నీచర్‌ని తుడిచేందుకు పొడి వస్త్రాన్ని వాడండి. వీటిని మరింతగా మెరిసేలా చేయాలంటే వ్యాక్స్, పాలిష్ కూడా చేయొచ్చు.

వీటిమూలల్లో కర్పూరం, నాప్తలీన్ బాల్స్ వేయడం వల్ల అవి తేమని గ్రహించి పురుగు పట్టకుండా చూ-స్తాయి. కాబట్టి, రెగ్యులర్‌గా వీటిని చక్కగా ఇలా క్లీన్ చేసుకోవచ్చు.

అదే విధంగా, దుమ్ముని క్లీన్ చేయాలంటే డిష్ వాష్ తీసుకుని నీటిలో కలిపి అందులో సాఫ్ట్ క్లాత్‌ని ముంచి బయటికి తీసి పిండి తడి గుడ్డతో ఫర్నీచర్‌ని రుద్దాలి.

తర్వాత పొడిగుడ్డతో తుడిచి వీటిని చక్కగా తుడవండి.

ఇలా క్లీన్ అయిన ఫర్నీచర్‌ని పూర్తిగా ఆరబెట్టండి.

పాతపాలిష్‌ని తొలగించడం..

కొన్ని వస్తువులు పాత పాలిష్‌తో చూడ్డానికి అంత బాగుండవు. వీటిని క్లీన్ చేయాలంటే.. ముందుగా కొద్దిగా టీ బ్యాగ్స్ తీసుకుని వేడినీటిలో వేసి డికాషన్ చేయాలి. ఇది గోరువెచ్చగా అయ్యే వరకూ ఉంచి గుడ్డపై దీనిని పోస్తూ కొద్దికొద్దిగా తుడవాలి. టీ నుంచి వచ్చే టానిక్ యాసిడ్ వుడ్‌ని క్లీన్ చేస్తుంది.

మరకలు దూరమవ్వాలంటే..

## పైనాపిల్ హల్వా, ఇలా చిటికెలో చేసేయచ్చు



పైనాపిల్ పేస్ట్రీలు, కేకులు అంటే ఎంతో మందికి ఇష్టం. వాటి ఫ్లేవర్ మనసును లాగేస్తుంది. ఇంట్లోనే చాలా తక్కువ సమయంలో సులువుగా పైనాపిల్ హల్వాను చేసుకోవడం ఇక్కడ చెప్పాం. ఇది రుచితో పాటూ ఎంతో ఆరోగ్యాన్ని అందిస్తుంది. పిల్లలకు చాలా నచ్చేలా ఉంటుంది దీని టేస్ట్. ఎలా చేయాలో చదవండి మరి.

కావాల్సిన పదార్థాలు

పైనాపిల్ ముక్కలు - రెండు కప్పులు
పంచదార - 200 గ్రాములు
కోవా - అర కప్పు
నెయ్యి - రెండు స్పూనులు
యాలకుల పొడి - ఒక టీస్పూను
జీడిపప్పులు - నాలుగు
కిస్‌మిస్‌లు - ఎనిమిది

తయారీ ఇలా

1. పైనాపిల్ పండ్లను చిన్న ముక్కలుగా కోసుకోవాలి.
2. ముక్కలు పొడిపొడిగా ఉండేలా చూసుకోవాలి. నీళ్లు ఉండకూడదు.
3. స్టవ్ పై కళాయి పెట్టి నెయ్యి వేయాలి. అందులో పైనాపిల్ ముక్కలను వేసి వేయించాలి.
4. ముక్కలు కాస్త వేగి మెత్తగా అవుతాయి. ఆ సమయంలో పంచదార, కోవా ముద్ద కూడా వేసి బాగా కలపాలి.
5. యాలకుల పొడి, జీడిపప్పులు తురుములు కూడా వేసి బాగా కలపాలి.
6. అంతా దగ్గరగా ముద్దలా అయ్యేదాకా కలియబెట్టాలి. స్టవ్ చిన్న మంట మీద ఉండేలా చూసుకోవాలి. లేకుంటే మాడిపోయే ప్రమాదం ఉంది. చివరగా కిస్‌మిస్‌లు చల్లి స్టవ్ కట్టేయాలి. అంతే టేస్టీ పైనాపిల్ హల్వా రెడీ అయినట్టే. మీరు వండుతున్నప్పుడే మంచి సువాసన వస్తుంది హల్వా.
7. ఒక ప్లేటులో పైనాపిల్ హల్వాను వేసి ముక్కలుగా కోసుకోవాలి.

తింటే ఎన్ని ప్రయోజనాలో...

పైనాపిల్ పండు కొయ్యడం కష్టమని చాలా మంది కొనడానికే ఇష్టపడరు. కానీ దాని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ పండు ఒక్కసారి మూడు ముక్కల దాకా తినగలరు. ఆ తరువాత కొంచెం నాలుక పూసినట్టు అవుతుంది. అదే ఇలా హల్వా చేసుకుంటే ఎంతైనా తినేయగలరు. ఈ పండులో 85 శాతం నీరే. చక్కెర 13 శాతమే ఉంటుంది. వీటిలో %ూ, దీ, జ% విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. దీని తినడం వల్ల మూత్రపిండాల్లో రాళ్లు కూడా కరుగుతాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పండుకు కాస్త తేనె రాసుకుని తింటే శక్తి పెరుగుతుంది. బరువు తగ్గాలనుకునేవారికి అనాస చాలా మేలు చేస్తుంది. ఈ పండు రసం గొంతు నొప్పిని తగ్గిస్తుంది. దీనిలో ఉండే పోషకాలు చర్మాన్ని మెరిపిస్తాయి. కంటి చూపును మెరుగుపరచడంలో కూడా ఇవి ముందుంటాయి.

# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్ధ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?



సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికి.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com